
జనవరి - ఫిబ్రవరి, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



నీ దేవుడైన యెహోవా నీకు తోడైయున్నాడు.
నీకేమియు తక్కువ కాదు.

ది. 25.12.2011 క్రిస్మస్ ఆరాధనలో ఎంతో శ్రద్ధాభక్తులతో ఆరాధిస్తున్న దేవుని ప్రజలు.





జనవరి - ఫిబ్రవరి, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- మనస్సులోని మాట ........ 2
- ఏదీ కాదు తక్కువ... ........ 3
- క్రీస్తు సంఘములో ........ 6
- వెనుదిరుగకు (స్త్రీల ప్రత్యేకం) ........ 7
- ఇది సమయమా? ........ 10
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 20వ భాగము ........ 12
- శత్రువే... మిత్రుడు! (బాలల శీర్షిక) ........ 14
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 16
- ప్రార్థన ఊపిరి పీల్చుట వంటిదే ........ 18
- నదులు ........ 20
- బైబిల్ క్విజ్-20 ........ 21
- ప్రార్థనా కూడికలు ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికి వందనములు. దేవునికి స్తోత్రములు, నూతన సంవత్సర శుభాకాంక్షలు.

గడిచిన సంవత్సరమంతా మన పరిచర్యలలో ఆయాస్థలములలో ఉన్న ప్రతి ఒక్కరి మీద దేవుని మహా కనికరమును ఉంచి, ఇరుకులలో ఇబ్బందులలో సహితము ఆయన యందలి విశ్వాసములో నుండి తప్పిపోకుండా కాపాడినందుకు మనము ఎంతో కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసినవారమై యున్నాము.

2011వ సంవత్సరములో అన్ని పరిస్థితులలోనూ మీలో అనేకులు ఎంతో నమ్మకముగా సంఘము అనే క్రీస్తు శరీరములో అవయవములుగా ఉన్నందుకు మీకు నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు. పరిచర్యను నడిపించడానికి నాయకత్వపు బాధ్యతలు శ్రమతోను, కష్టముతోను కూడుకున్నవైనప్పటికి, దేవుని కృపను బట్టియు మరియు మీరు నాతో కూడా పాలిభాగస్థులై ఉండుట వలన ఎంతో సంతోషముతో బాధ్యతలను నెరవేర్చుటకు దేవుడు సహాయం చేయడం జరిగింది.

2012వ సంవత్సరపు సేవకొరకు మనలను మనము దేవునికి అప్పగించుకుందాము. క్రొత్త సంవత్సరంలో పరిచర్యలోని ప్రతి పరిచారకుడు నమ్మకంగా ఉండులాగున మీ ప్రార్థనలో జ్ఞాపకం చేసుకొనవలెనని నా మనవి. దేవునిలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా విశ్వాసములో ముందుకు వెళ్ళవలెననే గాని, బలవంతముగానూ, ఆగ్రహ భయముతోనూ చివరి వరకు దేవుని సేవించుట సాధ్యం కాదు. కనుక దేవుడు నాకు అప్పగించిన ప్రతి ఒక్కరి విషయంలో నేను అట్టి ఉద్ధేశ్యం మాత్రమే కలిగి ఉంటిని.

నా ప్రియ సహోదర, సహోదరీలైన వారికి నేను తెలియపరచుకుంటున్న విషయమేమనగా మీరు పూర్తి స్వతంత్రతతో దేవునిలో ముందుకి కొనసాగవలెననియు, మీ బ్రదుకు దినములన్నియు దేవునితో వ్యక్తిగత సంబంధం కలిగి జీవించాలని నా హృదయాభిలాష.

మీ సహోదరుడు.....



# ఏదీ కాదు తక్కువ...

- బ్రదర్. ఎపఫ్రా

**నీ దేవుడైన యెహోవా నీకు తోడైయున్నాడు,**
**నీకేమియు తక్కువ కాదు - ద్వితీ 2:7**

దేవుళ్ళు, దేవతలు అనబడేవారు లోకములో అనేకులు ఉన్నారు. కానీ నిజమైన దేవుడు ఎవరు? ఆయన ఎవరైనప్పటికి, లోకమంతటికి ఒక్కడే ఉండాలి లేక ఉంటాడు. మేధావులు అనబడే వారిలో అనేకులు ఏదో అదృశ్య శక్తి (super natural power) లోకమును నడిపిస్తుంది అని బలంగా నమ్ముతారు. బైబిల్ గ్రంథం సృష్టిలో ఉన్న ప్రతి విషయమును గురించి స్పష్టమైన అవగాహనను కలిగించుచున్నది. భూమి, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, భూజంతువులు, ఆకాశపక్షులు, సముద్ర జల చరములు, స్త్రీ, పురుషులు సైతము ఎలాగు సృష్టించబడ్డారో ఈ గ్రంథంలో మనము చదవగలుగుతాము. బైబిలు గ్రంథములో వ్రాయబడిన ప్రతి విషయమునకు ఆధారములు కనబడుచున్నవి. ఆయనే దేవుడు అనుటకు చరిత్రలో అనేక సాక్ష్యములు ఉన్నాయి. ఆయన కాదు అనుటకు ఆధారము ఒక్కటి కూడా లేదు.

ఆ దేవుని మనము కనుగొని నా దేవుడు అని పిలుచుటకు మనము చేయవలసింది దేవుని మాట మన హృదయంలో విశ్వసించుట. నిజదేవుని ఎరుగక జీవిస్తున్న అబ్రాహాము అనే వ్యక్తి దేవుని మాటని నమ్మగా అతనికి దేవుడైన యెహోవా తోడైయుండుట జరిగింది. ఎవరికి సృష్టికర్తయైన దేవుడు తోడుగా ఉంటాడో ఆ మనుష్యుడు ధన్యుడు. ఇశ్రాయేలీయులు అను ప్రజలకు దేవుడు తోడుగా ఉండి, వారు బానిసలుగా బ్రతుకుతున్న ప్పుడు వారిని క్షేమకరమైన కనాను దేశమునకు నడిపించారు. ఐగుప్తు దేశములో బానిసలైన వారి జీవిత ములకు సమాధానకరమైన, సమృద్ధి కలిగిన కనాను దేశమును ఇచ్చారు.



అలాగే యేసుక్రీస్తు 2011 సంవత్సరముల క్రితం పుట్టింది లోకములో ఉన్న జనులందరికి తోడైయుండుటకు, ఆయన పేరులోనే ఈ సంగతి అర్థమవుతుంది. **"ఇమ్మానుయేలు" అని ఆయన పేరు, అనగా దేవుడు మనకి తోడు అని అర్థం మత్తయి 1:23.** ఆయన భూమి మీద

331/2 సంవత్సరములు జీవించి మానవాళి పాపశిక్ష అంతటి కొరకు సిలువ మరణము పొంది, సమాధి చేయబడి మూడవ దినమున సమాధిలో నుండి సజీవుడిగా లేచాడు. ఆ తరువాత అనేకులకు కనిపించి, పరలోకమునకు ఆరోహణమయ్యాడు. **ఆయన వెళ్తూ ఇదిగో యుగసమాప్తి వరకు సదాకాలం మీతో కూడా ఉంటాను మత్తయి 28:20 అని చెప్పడం జరిగింది.** అనగా యుగసమాప్తి వరకు దేవుడు మనకి తోడుగా ఉంటాడు అని మనం గ్రహించాలి.



**"నీకేమియు తక్కువ కాదు":**

దేవుడు ఇచ్చిన వాగ్దానములో "నీకేమియు తక్కువ కాదు" అనే విషయం ఎంతో ప్రాముఖ్యమైనది. భూమి మీది ప్రతి మనుష్యుడు తనకి ఏమీ తక్కువ కాకూడదు అని తలంచుకుంటాడు. కానీ ఏదీ తక్కువ కాకుండా జీవించడం నిజదేవుని విశ్వసించని ఎవరికీ సాధ్యం కాదు. **దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకుందురు కీర్తన 14:1** డబ్బు తక్కువ కాకపోవచ్చు, ఆరోగ్యంగా ఉండవచ్చు చూడడానికి అన్నీ ఉన్నట్లు కనిపించవచ్చు కానీ ఖచ్చితంగా ఏదో లేదు అనే భావన దేవుడు లేని వ్యక్తులలో కనబడుతుంది. దేవుని ఎరిగిన వారికి "ఏమీ తక్కువ కాదు". భక్తుడైన దావీదు **యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు కీర్తన 23:1 అని అన్నాడు.** గొప్ప రాజై యుండి అన్నీ కలిగి ఉన్నప్పటికి దేవుడు ఉంటేనే నాకు సమస్తము ఉన్నట్లు అని చెప్తున్నాడు. అందుకే దావీదు తన జీవిత కాలములోనే కాక, అతని సంతానము మీద కూడా దేవుని శాశ్వత కృప నిలిచి ఉంటుందనే వాగ్దానము పొందాడు.

యేసుక్రీస్తు పుట్టిన తరువాత జరిగిన సంఘటనలను మనము బైబిల్‌లో నూతన నిబంధనా గ్రంథంలో చూస్తాము. ఆయన 12మంది శిష్యులను ఏర్పరచుకొని, వారికి అనేక విషయములు నేర్పించారు. ఒకరోజు ప్రభువు వారిని పిలిచి, దేవుని రాజ్యము ప్రకటించుటకును, రోగులను స్వస్థపరచుటకును, ఇద్దరిద్దరినిగా పంపించాడు. వారు తిరిగి

ఆయన యొద్దకు వచ్చినప్పుడు "మీకేమైనా తక్కువాయెనా ?" అని అడిగినప్పుడు వారు ఏమీ "తక్కువ కాలేదనిరి" లూకా 22:35 అలాగుననే సకల సంపూర్ణతకు, సర్వసమృద్ధికి ఆధారమైన ప్రభువు మనకి తోడై యుంటే మనకును ఏదీ తక్కువ కాదు.

ప్రియ స్పర్శ పాఠకులైనవారు ఆయన నాతో ఉంటే నాకు ఏ కొరతా ఉండదు అని గ్రహించాలి. 2012వ సంవత్సరం ఆరంభంలో దేవుడు పరిచర్య ద్వారా మనకి అనుగ్రహించిన వాగ్దానమును స్వతంత్రించుకుందాము. మన జీవితములో కలిగే ప్రతి ఇరుకులో ఇబ్బందులలో, అన్ని పరిస్థితులలో వాగ్దానమును జ్ఞాపకం తెచ్చుకొని దేవుని నామములో ప్రార్థన చేయడం ద్వారా ప్రతి సమయములోనూ ఆశ్చర్యమైన దేవుని సహాయం దొరుకుతుంది. ఏదియూ మనకి తక్కువ కాదు.

"ఏదియూ తక్కువ కాకుండా దేవుడు మనలను నడిపించును గాక !"

## ఉపవాస ప్రార్థన

ఉపవాస ప్రార్థన - 2012, **జనవరి 26వ** తేది (గురువారం)
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.
ఆసక్తి కలిగినవారు మాత్రమే పాల్గొనవలసినదిగా మా విన్నపం.

**స్థలము:**
**బాలాజీ ఫంక్షన్ హాల్, N.H.9, హయత్‌నగర్**

వివరములకు: 9666666249
040-24202227

# క్రీస్తు సంఘములో ...

## అనుసరించుడి ...

1. ఒకరిని ఒకరు ప్రత్యేకమైన అవయవములుగా ఎంచుకొనుడి - (రోమా 12:4,5)
2. ఒకరికి ఒకరు సహోదర ప్రేమ విషయములో అనురాగము గలవారై యుండుడి - (రోమా 12:10)
3. ఒకరి యందు ఒకరు ఘనత విషయములో గొప్పగా ఎంచుకొనుడి - (రోమా 12:10)
4. ఒకరితో ఒకరు మనస్సు కలిసిన వారై ఉండుడి - (రోమా 15:5,6)
5. ఒకరికి ఒకరు దాసులై యుండుడి - (గలతీ 5:13)
6. ఒకరిని ఒకరు ప్రేమతో సహించుకొనుడి - (ఎఫెసీ 4:1,2)
7. ఒకరి భారములు ఒకరు భరించుడి - (గలతీ 6:2)

## విడిచిపెట్టుడి...

1. ఒకరికి ఒకరు తీర్పు తీర్చుకొనుట - (రోమా 14:13)
2. ఒకరికి ఒకరు వివాదమును రేపుకొనుట - (గలతీ 5:26)
3. ఒకరి యందు ఒకరు అసూయపడుట - (గలతీ 5:26)
4. ఒకరితో ఒకరు అబద్ధములాడుట - (కొలస్సీ 3:9)
5. ఒకరిని ఒకరు ద్వేషించుకొనుట - (తీతు 3:)
6. ఒకరికి ఒకరు విరోధముగా మాటలాడుకొనుట - (యాకోబు 4:11)
7. ఒకరి మీద ఒకరు సణుగుకొనుట - (యాకోబు 5:9)

# వెనుదిరుగకు

- సిస్టర్ విజయ

**లోతు భార్యను జ్ఞాపకము చేసుకొనుడి లూకా 17:32**

దేవుని నామములో స్త్రీల భాగం చదువుతున్న మీ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రభువు తన శిష్యులతో మాట్లాడుతూ లోతు భార్యను జ్ఞాపకం చేసుకోమని చెప్పారు. ఆయన ఆలాగు చెప్పడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి మనలో ఏ ఒక్కరమూ ఆయన మార్గములో నుండి తప్పిపోకూడదని. ఎంతో మందికి దీవెనకరంగా ఉండవలసిన లోతు భార్య దేవుని సంకల్పం నుండి దూరమై, శాశ్వత జీవమును కోల్పోయి, జీవితమునే నష్టపరచుకుంది. ఆమె ఇలాంటి పరిస్థితిలోనికి వెళ్ళడానికి గల కారణములను మనము ధ్యానించుకుందాం.

**తినుచూ, త్రాగుచున్న కాలము**

లోతు అతని భార్య జీవించిన కాలములో జనులు తినుటకు, త్రాగుటకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని మనకి అర్థమవుచున్నది. తినుట, త్రాగుట జీవించడానికే అయ్యి ఉండాలి కానీ తినుటకు, త్రాగుటకే బ్రదకకూడదు. ఆనాటి నుంటి నేటి వరకు ఎందరో జీవితార్థము తెలియకుండానే బ్రదకడమనేది శోచనీయమైన విషయం.

**కొనుచూ, అమ్ముచున్న కాలము**

Trading అనే మాటకి వర్తకము అని అర్థము. వర్తకము అనే మాటని వాడుక భాషలో కొనుచూ, అమ్ముచుండుట అని అనవచ్చును. నేడు ఈ కార్యక్రమం దేశముల ఎల్లలు సైతము చెరిపివేసి విస్తారముగా విస్తరించియున్నది. దీని ద్వారా మిలియనీర్స్‌గా, బిలియనీర్స్‌గా మారిన వారు ఎందరో ఉన్నారు. కోటాను కోట్ల వ్యాపారము వర్తకము ద్వారానే జరుగుతుంది. నేటికి నాటికి వర్తక విధానములో మార్పు ఉన్నప్పటికి మనుష్యులు కొనుట, అమ్ముట అనే విషయంలో ఎంతో తొందరపడుతూ ముందుకు వెళ్తున్నారనేది వాస్తవం. లోతు దినములలో కూడా కొనుచూ, అమ్ముచూ ప్రజలు ఉన్నారని బైబిల్ గ్రంథంలో వ్రాయబడి యుండడం దీని యొక్క తీవ్రతకు అద్దం పడుతుంది.

**నారు నాటుచూ, ఇండ్లు కట్టుచూ**

మనుష్యులు విలువైన జీవితమును గురించిన అర్థమును మార్చివేసి, జీవించడానికి అవసరమైన వాటిని జీవితముగా భావిస్తున్నారు. పంటలు పండించుకొనుట, గృహములను అనగా ఇండ్లను కట్టుకొనుట అనేవి జీవించడానికి అవసరమై ఉండగా, అవే జీవితం అని

అనుకుంటూ జీవితకాల మంతటిని వాటి కొరకే వ్యయపరచడం చాలా దుఃఖకరమైన విషయం. కొందరిని మనం గమనిస్తే, జీవితమునకు ఎంతో అర్థవంతమైన మానవ సంబంధములను, దైవసంబంధములను ఏ మాత్రం పట్టించుకొనకుండా పంటలు పండించుటలో ఇండ్లు కట్టుకొనుటలో బిజీ బిజీగా ఉంటారు. లోతు దినములలో కూడా ఇలాంటి ప్రవర్తనతోనే జనులు ఉండేవారని చరిత్ర మనకు చెప్పుచున్నది.

తినుచూ, త్రాగుచూ, కొనుచూ, అమ్ముచూ, నారునాటుచూ, ఇండ్లు కట్టుకొనుచూ విస్తారమైన పనులలో సొదొమ, గొమొఱ్ఱా పట్టణ ప్రజలు ఉన్నప్పుడు దేవుడు పంపిన దూతలు ఆ పట్టణంలో నివసిస్తున్న లోతు దగ్గరకు వెళ్ళి, ఈ పట్టణమును దేవుడు నాశనం చేయబోవుచున్నాడు, మీరు బయటకు వెళ్ళండి అని తెలియపరిచారు. లోతు వెళ్ళి తన కుమార్తెలను వివాహమాడు అల్లుళ్ళకు ఈ సంగతిని తెలియపరచగా వారు ఇతనిని ఎగతాళి చేయడం జరిగింది. అప్పుడు దేవుని దూతలు లోతు అతని భార్య, ఇద్దరు కుమార్తెలను ఆ పట్టణం నుండి బయటకు తీసుకొని వచ్చి వెనుకకు చూడవద్దు పారిపొమ్మని చెప్పారు. లోతు తన కుటుంబమంతటితో వెళ్ళి పోతుండగా లోతు భార్య వెనుకకు తిరిగి చూచింది. వెంటనే ఉప్పు స్థంభంగా మారిపోయింది.



ఆమె అలా మారడానికి గల కారణం ఆలోచిస్తే తాను విడిచి వచ్చిన పట్టణం మీద మమకారం, మనసులో దాని మీద ఉన్న ఆశ పోలేదు. అందుకే కొంత దూరం వచ్చిన తరువాత వెనుకకు తిరిగి చూడకుండా ఉండలేకపోయింది. నేడు దేవుడు మనలను లోకములోనుండి బయటకు తీసుకువచ్చి అనగా లోక ఆచారములు, పద్ధతులు, ఆడంబరములలో నుండి విడిపించి, నడిపిస్తూ ఉండగా లోకములో జీవించుచున్న అనేకులను చూచి విడిచిన వాటిని తిరిగి చూడాలి అని ఆశించడం శోచనీయమైన విషయం. నేటి దినములలో మనము లోకము, లోకాశలతో కొట్టబడుచూ జీవితములో దేవుని కంటే ఎక్కువగా స్వంత ఇష్టమును నెరవేర్చుకొనుచూ జీవించడం ఏమాత్రం క్షేమము కాదు.

లోతు భార్య జ్ఞాపకం మన జీవితమును గొప్ప మలుపు త్రిప్పేదిగా ఉండాలి. ఈ లోకం నుండి దేవుడు ప్రత్యేకపరచి, పరలోకపు ప్రయాణంలో మనలను నడిపిస్తూ ఉండగా, **ఎల్లప్పుడూ వెనుక ఉన్నవాటిని మరచి ముందున్న వాటికొరకై వేగిరపడవలెను ఫిలిప్పీ 3:13.** వెనుకకు చూచుట అనగా పాత సంగతులను జ్ఞాపకం తెచ్చుకుంటూ, పాత జీవితం మీద మమకారం కలిగియుండుట. వాటి నుండి విడిపించబడి, దేవుడు మనలను నడిపించే మార్గములో ముందుకి వెళ్ళడానికి ఇష్టపడదాము.

ప్రియమైన సహోదరీ! జీవితములో ప్రభువు చూపించిన మార్గములో ప్రయాణించడానికి నిర్ణయించుకున్న నీవు ఎన్నడూ వెనుదిరిగి చూడకు. పరిస్థితులు మనలను ఎంత ఇబ్బంది పెట్టినా, లోకం ఎంత తొందర చేసినా ఆఖరి శ్వాస వరకు ఆయనతోనే ముందుకి సాగిపోవాలి. యేసయ్య ఒకరోజు తన శిష్యులతో **"నాగటి మీద చెయ్యి పెట్టి వెనుక తట్టు చూచువాడు నా రాజ్యమునకు పాత్రుడు కాడు" లూకా 9:62** అని అన్నారు. దీనిని బట్టి బ్రదుకు దినములన్నిటా వెనుకకు చూడకూడదని అర్థమవుతుంది. వెనుదిరిగి చూడటం వలన ఏమి జరుగుతుందో లోతు భార్యను గమనిస్తే అర్థం చేసుకోవచ్చు.

దేవుడు మిమ్మును ఎన్నడూ వెనుదిరగని వారిగా చేయును గాక! ఆమెన్!

# ఇది సమయమా ... ?

దేవుని ప్రేమను బట్టి అనేకమంది మన రక్షణ కొరకు క్రీస్తునందు త్యాగపూరితంగా ప్రయాసపడ్డారు. ఒకవేళ వారు స్వార్ధపూరితంగా ఆలోచించి వారి విలువైన సమయమును, ధనమును, ఆరోగ్యమును వ్యయపరచడానికి ఇష్టపడనట్లైతే ఈ రోజు నీవు, నేను కూడ రక్షణ పొంది ఉండేవారము కాదు, ఇంకను నశించి పోతున్న వారి జాబితాలోనే ఉండేవాళ్ళము.

నిజానికి ఈ రోజుల్లో ఇతరుల గురించి విజ్ఞాపన చేసే మనసు ఎంతో లోటుగా వుంది. ఎందుకంటే మనం ఇతరుల గురించి... ప్రార్థించునపుడు ఇహలోక సంబంధమైన ఘనత  రాదు, కానీ రహస్యమందు చూస్తున్న దేవుని నుండి గొప్ప ఆశీర్వాదం పొందుకుంటాం

ప్రభువునందు ప్రియమైన మనమమందరము ఒకసారి దేవుని ఇల్లంతటిలో నమ్మకమైనవాడు అని దేవునిచే ఆమోదముద్ర పొందిన మోషే ప్రార్థనను జ్ఞాపకము చేసుకొందాం..

**మోషే:** అయ్యో నీవు వారి పాపమును ఒకవేళ పరిహరించితివా, లేని యెడల నీవు వ్రాసిన నీ గ్రంథములో నుండి నా పేరు తుడిచివేయమని బతిమాలుకొనుచున్నానెను. (నిర్గమ 32:31,32)

మనలను రక్షించుటకు సిలువపై తండ్రిని విడిచి పెట్టిన క్రీస్తు యేసు ఆత్మను నిజముగా మోషే కలిగియుండెనని అనుటలో ఎటువంటి అతిశయోక్తి లేదనిపిస్తుంది.

మనము ఒకసారి దేవుని పరిశుద్ధ గ్రంథంలోని ఎస్తేరు ప్రార్థనను జ్ఞాపకం చేసుకుందాం..

**ఎస్తేరు:** నేను నశించిన నశించెదను (ఎస్తేరు 4:17) అంటూ నా ప్రజల మీదకి ఈ భయంకరమైన కీడు వచ్చుట నేను ఏ విధంగా చూడగలను అని తలంచి తాను ఉపవాసము ఉండి త్యాగపూరితంగా తన ప్రాణమును పణంగా పెట్టి హామాను కుయుక్తి నుండి తప్పించ గలిగింది.

ప్రస్తుతం మన ముందర నిలిచిన 21వ శతాబ్దపు నూతన నిబంధన ప్రార్థనా వీరులను ఒకసారి జ్ఞాపకం చేసుకుందాం

**01. జాన్‌నాక్స్ ప్రార్థన:**

ఓ దేవా ... ఈ స్కాట్‌లాండ్ దేశాన్ని నాకు ఇవ్వండి లేకపోతే నేను చనిపోతాను. జాన్‌నాక్స్ అనే ఈయన స్కాట్‌లాండ్ దేశాన్ని మేరీ అనే రాణి పరిపాలిస్తున్న కాలంలో అపొస్తలుడు (మిషనరీ) గా ఉన్నవాడు.

**02. జార్జ్‌విట్‌ఫీల్డ్:**

ఓ దేవా ... ఇదిగో ఈ ఆత్మలను రక్షించండి లేనట్లయితే నా ఆత్మను తీసివేసుకో. జార్జ్‌విట్‌ఫీల్డ్ అనే ఈయనకు బహిరంగ ప్రసంగములకు రారాజు అని పిలువబడేవాడు.


**03. మన ప్రార్థన:**

మీ స్వహస్తాలతో వ్రాసుకొని నశించిపోతున్న ఆత్మలకొరకు ఎడతెగక ప్రార్థించండి.

నశించి పోతున్న వారికోసం భారంతో ప్రార్థించడం మన కనీస బాధ్యత. కనుక ప్రతిరోజు ఒక ప్రత్యేకమైన రీతిలో నశించిపోతున్న ఆత్మలు అనగా మనకు అతి సమీపంగా ఉంటున్న మన పొరుగువారు, ఇంటి ఓనర్ మనతోపాటు అద్దెకు ఉంటున్నవారు, సహ ఉద్యోగులు, స్నేహితులు, ఇంకా ప్రార్థించగలిగితే ఉత్తరభారత దేశంలో క్షుద్రశక్తుల ప్రభావములతోను, అంటురోగముల మధ్యలో ఉన్నవారి కొరకు, ప్రత్యేకమైన భాష, లిపి లేని కొండజాతి ప్రజల మధ్యలో ఇంకను ప్రపంచవ్యాప్తంగా దేవుని కొరకు ఎన్నో త్యాగాలు చేస్తూ, అన్నింటిని ఓర్చుకుంటూ సువార్త పరిచర్య జరిగిస్తున్న వారి కొరకు, భూమి మీద యేసు చెప్పిన మాటలను నెరవేరుస్తున్న మిషనరీల పరిచర్య కొరకు చివరిగా మనము ప్రేమిస్తున్నామని చెబుతున్న నశించిపోతున్న మన భారతీయుల కొరకు భారంతో ఎడతెగక ప్రార్థిద్దాము.

అట్టి భారమును దేవుడు మనకు దయచేయును గాక !

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర




- సీరియల్ 20వ భాగము

టిబెట్‌లోని మతాశ్రయముల దగ్గర ఎంతో భక్తి సందడి ఉంటుంది. అచటి లామాలు వీరికి కావలసిన సహాయ సహకారములు అందిస్తూ ఉంటారు. వీటిలో నివసించే లామాలు బిగ్గరగా ప్రార్థనలు చేస్తూ గంటలు మ్రోగిస్తూ ఉంటారు. విశాలమైన ఆ ప్రాంతాలలో అక్కడక్కడ కనిపించే గ్రామాలలో మాత్రమే గాక సంచార జీవులపై కూడా ఆ లామాల ఆధిపత్యానికి తిరుగులేదు. కొండ జాతి ప్రజలు వైరములతో నిండిన వారై స్థానిక దేవతలను పూజిస్తుంటారు గాని టిబెట్ ప్రజలైతే ఎన్నో శతాబ్దాల క్రితం దలైలామా ముఖ్యునిగా ఏర్పడిన భక్తి పద్ధతిలో పూర్తిగా మునిగి పోయారు. అతనితో వారికున్న సంబంధాన్ని ఏ రాజు గాని, దేవతలుగాని మరెవ్వరు గాని ఛేదించలేరు.

అయితే సందర్‌కి ఇవేమీ తెలియవు. పెట్టని కోట గోడ వలెనున్న హిమాలయాలను చూస్తున్నపుడు వాటి ఆవల ఎంత మంది ప్రజలున్నారనేది సందర్‌కి తెలియదు. అయితే మంచు కరిగే కాలంలో వస్తుమార్పిడి పద్ధతి ద్వారా తమకు కావలసినవి కొనుక్కోవడానికి సంతోషంగా, ధైర్యంగా ఉన్న బలిష్ఠులైన వారు రావడాన్ని గమనించేవాడు. అయితే వారు చాలా మురికిగా ఉండేవారు. అంతేగాక వారికి మూఢనమ్మకాలెక్కువ. చేతులతో జపమాలలు త్రిప్పుచూ నామములను జపిస్తూ ఉంటారు. ఇలా జపిస్తే మరుసటి జన్మలో మరింత శ్రేష్ఠమైన వారిగా తాము జన్మిస్తామని వారి నమ్మకం. వీరిలో కొందరు తమ బట్టల మడతల్లో ప్రార్థనా చక్రాలను తెస్తుండేవారు. ప్రతిసారి వీటిని బయటకు తీసి త్రిప్పుచుంటారు. వీటిని ఎంత వేగంగా త్రిప్పితే అంత వేగంగా తాము ప్రార్థించినామని వారి నమ్మకం. దానిని త్రిప్పేటప్పుడు మనస్సు ఎక్కడున్నా వారికి పట్టింపు లేదు. ముదురు ఎరుపు రంగు బట్టలతో అందరిలోను విలక్షణంగా లామాలు వారి మధ్య తిరుగుచూ ఉంటారు. ఈ లామాలు ఎలాంటి పని చేయడాన్ని ఆ ప్రజలు ఒప్పుకోరు. వారు పని చేయాలని ఆశించరు కూడ. ప్రజలు వారిని భయభక్తులతో పూజిస్తుంటారు. శీతాకాలం వచ్చేసరికి వీరంతా తమ తమ ప్రాంతములకు తిరిగి పోతూ ఉంటారు.

మాటి మాటికి ఆ పర్వతముల వైపే చూచేవాడు సుందర్. అక్కడ నివసించే ప్రజలకు పాపక్షమాపణను, నిత్యరక్షణను శక్తి వంచన లేకుండా ప్రకటించే సమయం ఆసన్నమైనదని దృఢంగా భావించాడు. కొందరు భారతీయ వ్యాపారులు వెళ్ళుచున్న మార్గంలోనే తాను టిబెట్‌కి బయలుదేరాడు. అప్పటికి సుందర్‌కి 19 ఏండ్లు. హిమాలయ పర్వత చరియల్లోని పూ అనే పట్టణానికి వచ్చినప్పుడు అక్కడ ఇద్దరు ఐరోపా దేశీయులున్నారని, ఆ సరిహద్దు ప్రాంతంలో క్రైస్తవ మిషన్ స్థాపించాలని, అచటి నుండి టిబెట్ వారికి సువార్తని అందించాలన్న ధ్యేయంతో వారు అక్కడికి వచ్చారని సుందర్ తెలుసుకున్నాడు. 50 యేండ్ల క్రితం లడఖ్, కాశ్మీర్‌లలో స్థాపితమైన మొరేవియన్ మిషన్‌కు చెందిన వారు వీరు. టిబెట్‌కు సువార్తను కొనిపోవడమే వారి ముఖ్యోద్దేశముగాని వారి ప్రయత్నములు అన్నీ వమ్మైపోగా సరిహద్దులలో స్థిరపడిపోయారు. వారు టిబెట్ భాష నేర్చుకుంటూ ఉన్నారు. టిబెట్‌కు సువార్తను కొనిపోవాలన్న తమ వాంఛను వారికి తెలిపినప్పుడు వారాయనను ప్రోత్సహించి కొద్దిరోజులు తమతోనే ఉండి టిబెట్ భాషలోని ప్రాథమిక విషయాలు నేర్చుకొని తాను ఎదుర్కొనబోవు పరిస్థితులకు తన్ను తాను సిద్ధం చేసుకోమని సలహా ఇచ్చారు. చివరిగా సుందర్ టిబెట్‌కు బయలుదేరినపుడు తమ వద్ద పనికి కుదిరిన ఒక స్థానిక యువకుణ్ణి సుందర్‌కు తోడుగా పంపించారు. ఈ సహచరుడ్ని ఇచ్చినందుకు సుందర్ వారికి ఎన్నో కృతజ్ఞతలు తెలిపాడు. తాను వెళ్ళుచున్న ప్రజల భాష వారి కట్టుబాట్లు ఆచారములు తనకు తెలియవు గనుక ఇవన్నీ తెలిసిన ఒకరు తనతో కూడా లేకుంటే మొదటి ప్రయాణంలో తనకు సంభవించిన దాని కంటే ఘోర పరిస్థితిని ఎదుర్కొన వలసి రావచ్చునని గ్రహించాడు సుందర్.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)



# "శత్రువే... మిత్రుడు!"



Happy new year పిల్లలూ! Happy గా ఉన్నారా? ఈ Year అంతా మీరు Happy గా ఉండాలని నా ఆశ. Wishes చెప్పటమే కాదు మనం సంతోషంగా ఉండాలి, మన చుట్టూ ఉన్నవారిని కూడా సంతోష పెట్టాలి. పిల్లలూ! మిమ్మల్ని సంతోషింప చేయాలని, దేవునిలో ముందుకు నడిపించాలని పరితపిస్తున్నాను. సండేస్కూలుకు క్రమంగా వెళ్ళండి, నైతికంగా, ఆధ్యాత్మికంగా మీ ఎదుగుదలకు ఎంతగానో అది తోడ్పడుతుంది, నేను వ్రాసే స్టోరీస్ అందరితో ప్రేమ కలిగి జీవించడానికి ఉపయోగపడతాయని భావిస్తున్నాను. ఇక స్టోరీలోకి వెళదామా!

రాజు మంచివాడు. ప్రేమగలవాడు కూడా! పుట్టింది ఒక పల్లెటూరు. బ్రతుకు తెరువుకోసం city కి వచ్చాడు. అక్కడ కొన్ని షాపులలో పనిచేసుకుంటూ చర్చికి వెళ్ళేవాడు, తల్లితండ్రి లేరు. తాను వెళ్ళే చర్చియే తన కుటుంబం, ఆ చర్చి దగ్గరే ఉండమని పాస్టరుగారు రాజుకి ఆశ్రయం కల్పించారు.

మంచి నడవడి, క్రమశిక్షణ, విధేయత, నమ్మకత్వం ఉత్తమ లక్షణాలు గలవాడని పేరు తెచ్చుకున్నాడు గనుక ఆ కాలనీవాళ్ళు రాజుని అభిమానించి, ఆప్యాయంగా చూసుకునేవారు. అంతే కాకుండా పాస్టరుగారు అతనికి కొన్ని బాధ్యతలు కూడా అప్పగించారు. చర్చిని శుభ్రంగా ఉంచడం, అక్కడి వస్తువులు భద్రపరచడం అతని బాధ్యత. అందరూ అతన్ని అభిమానించి, గౌరవించడం మూలంగా అసూయపడిన కొందరు కుర్రాళ్ళు, ముఖ్యంగా చర్చి ప్రక్కనే ఉన్న శేఖర్ రాజుని దెబ్బతీయాలని అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. శేఖర్ ఆ కాలనీలో అందరితో దెబ్బలాడుతూ, గొడవలు పడుతుండేవాడు. అందరూ అతనికి దూరంగా ఉంటారు. రాజుకి చాలా మంది స్నేహితులు ఉన్నారు.

అది ఒక ఆదివారం, చర్చి వచ్చేపోయే వారితో హడావిడిగా ఉంది. రాజు మాత్రం తన పని తను చేసుకుని ఆరాధనలో కూర్చున్నాడు. ఆరాధన ముగిసాక అందరూ ఎవరి ఇంటికి వారు వెళ్తూ రాజుని పొగుడుతు మంచి కుర్రాడు అని అభినందిస్తూ ఉంటే శేఖర్‌కి ఆ మాటలు చాలా కోపమును కలిగించాయి. రాజు శేఖర్‌ని ప్రేమతో పలకరిస్తూనే ఉండేవాడు. చర్చి ముందు శుభ్రంగా ఉంటే చెత్త పోసేవాడు, రాళ్ళు వేసేవాడు. అయినా రాజు ఏమీ అనేవాడు కాదు. ఎన్ని మాటలు అన్నా ఒక్కసారి కూడా ఎదురు చెప్పకపోవడం వలన

గొడవ అయ్యేది కాదు. రాజు శేఖర్‌లో మార్పు కొరకు ప్రార్థన చేస్తూ ఉండేవాడు.

ఒకరోజు శేఖర్ రౌడీలా ఫోజ్‌పెట్టి, "నీవు పెద్ద హీరోవి అనుకుంటున్నావేమో నీవు దిక్కులేనివాడివి, తింటానికి తిండి లేక ఇక్కడికి వచ్చావని మర్చిపోకు, పాస్టరేదో పని అప్పగించినంత మాత్రాన పెద్ద మొనగాడినని అనుకుంటున్నావా?" అని ఎగతాళి చేశాడు. రాజు మౌనంగానే ఉండిపోయాడు.

ఒకరోజు శేఖర్ వేరేవాళ్లతో గొడవ పడుతుండగా వాళ్లు తల పగలగొట్టారు. ఒక్కరు కూడా అతనిని పట్టించుకోవటం లేదు. తలకి దెబ్బ తగిలి బొట బొటా రక్తం కారుతుంది. రాజు గబగబా వచ్చి, అతన్ని అమాంతం పైకెత్తి తన కర్చీఫ్‌తో కట్టుకట్టాడు. రక్త మాగిపోయింది. బాధతో శేఖర్ మూలుగుతుంటే నీళ్ళు త్రాగించాడు రాజు. శేఖర్ కళ్ళనిండా నీరు, కృతజ్ఞతా భావంతో నోట మాట రాలేదు. రాజు హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాడు. శేఖర్‌కి నొప్పి తగ్గి ఉపశమనం కలిగే వరకూ పరామర్శిస్తూనే ఉన్నాడు.

శేఖర్ నోరు తెరిచి మాట్లాడ సాగాడు. "నాకు దెబ్బ తగిలినందుకు సంతోషపడ తావనుకున్నాను. అలా కాక నన్ను పరామర్శిస్తూ ఒక తండ్రిలా ఆదరిస్తున్నావు, నాకు అవకాశం వస్తే నిన్ను విరగగొట్టి నీ రక్తం కళ్ళ చూడాలన్నంత కోపంగా ఉన్నాను. నేనే దెబ్బతిన్నాను, కానీ నా రక్తం నీ కళ్ళతో చూడలేక తుడిచివేసి, కట్టుకట్టావు. ఇది ఎలా సంభవం? ఇంత చెడ్డవాడిని ఎలా ఆదుకోగలుగుతున్నావూ?" అంటుంటే దుఃఖంతో, అతని గొంతుక పూడుకుపోయింది.

రాజు సాదరంగా నవ్వుతూ, "అదే శేఖర్! ప్రభువైన క్రీస్తు మానవులకు నేర్పింది. మిత్రులను ప్రేమించడం సర్వసాధారణం, కాని ఆయన శత్రువులను కూడా ప్రేమించమన్నాడు. ఇది వరకు నేను నీకు శత్రువునేమో కాని ఇప్పుడు కాదు. నీ మనసు మారింది గనుక ఇక మీదట మనం మిత్రులం అన్నాడు. శేఖర్ కూడా సంతోషంగా అంగీకరించాడు.

చూశారా పిల్లలూ! రాజు చూపించిన ప్రేమ చెడ్డవాడైన శేఖర్‌ని ఎలా మార్చిందో!. మీరు కూడా మీ తోటి వారిని ప్రేమతో దేవుని యొద్దకు నడిపిస్తారని దీనిని బట్టి మీ శత్రువులను కూడా మిత్రులుగా చేసుకోవాలని ఆశిస్తూ ఈ year అంతా దేవుడు మీకు తోడుగా ఉండి ఏదీ తక్కువ కాకుండా సహాయం చేయాలని కోరుకుంటున్నాను.

– మీ అక్కయ్య

# “నా జీవితములో దేవుని మేలులు”

**పి. సువర్ణరాజు, అవనిగడ్డ**

ప్రభువైన యేసుక్రీస్తు నామములో స్పర్శ పాఠకులైన మీ అందరికి నా వందనములు. నా పేరు సువర్ణరాజు, మాది అవనిగడ్డ మండలము, పిట్టలంక గ్రామము. నాకు ఇద్దరు అక్కలు, చెల్లి. మాది విగ్రహారాధన కుటుంబము. నాకు 13 సం॥ల వయస్సులో మా నాన్న చనిపోయారు. అప్పుడు మా అమ్మ ఇంటి ప్రక్కన వారితో కలిసి చర్చికి వెళ్తూ నన్ను కూడా తీసుకొని వెళ్ళేది. నేను 7వ తరగతిలో చదువు మానేశాను. పొలం పనికి వెళ్ళేవాడిని. ఈ విధంగా జరుగుతూ ఉండగా 2000 సంవత్సరంలో వ్యవసాయంలో పంటలు సరిగా పండకపోవడంతో హైదరాబాద్‌లో ఉంటున్న మా చిన్నక్క వాళ్ళ ఇంటికి వచ్చి అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో హెల్పర్‌గా జాయిన్ అయ్యాను. తరువాత 2005లో నాకు వివాహం జరిగింది. విగ్రహారాధన కుటుంబం నుండి వచ్చిన ఆమెను దేవుని వైపు ఎలా నడిపించాలో అని ఆలోచించి, అడిగినప్పుడు ఆమెకు కూడా యేసుప్రభువు అంటే ఇష్టమని, దేవునిలో కొనసాగడం కూడా ఇష్టమేనని చెప్పినప్పుడు నేను చాలా సంతోషించాను. వివాహముల కొరకు, తరువాత వ్యవసాయం కొరకు చేసిన అప్పులు, ఆర్థిక ఇబ్బందులు అనేక సమస్యలకు దారి తీశాయి. కుటుంబమును ఎలా పోషించుకొవాలో కూడా అర్థమయ్యేది కాదు. ప్రార్థన (చర్చి)కి వెళ్ళేవారము కానీ నామకార్థ క్రైస్తవులుగా ఉండేవారము. ఆర్థిక ఇబ్బందుల వలన ఇంటిలో గొడవలు జరిగేవి. జీవితములో సమాధానము లేక ఏ క్షణములో ఎలా ఉండేవాడినో నాకే అర్థమయ్యేది కాదు. తరువాత ఒకరోజు చింతల్‌లో ఉంటున్న మా బావమరిది దగ్గరకు వచ్చి వాళ్ళతో కలిసి ఎపఫ్రా మినిస్ట్రీస్ ప్రార్థనకు వచ్చాను. ఆరోజు దైవసేవకులు చెప్పిన వాక్యం ద్వారా దేవుడు నాలో ఎంతో ధైర్యమును నింపి బలపరిచారు. ఈ పరిచర్యకు వెళ్తే ఆత్మీయంగా ఇంకా బలపడతామనే ఆలోచనతో మేము చింతల్ వచ్చేశాము.

నా భార్య 7 నెలల గర్భవతిగా ఉన్నప్పుడు పొంగుజ్వరం వచ్చింది. అప్పుడు నాకు చాలా భయం, ఆందోళన కలిగింది. అయితే దేవుని యొక్క మహా కృప వలన అంతా బాగానే జరిగింది. తరువాత జూన్ నెలలో మారుమనస్సు పొంది, బాప్తిస్మం తీసుకున్నాను. చింతల్‌లో చేస్తున్న ఉద్యోగంలో కొన్ని ఇబ్బందుల వలన మరల పటాన్‌చెరు వెళ్ళిపోయాను. ఫిబ్రవరి 2, 2006న నేను పనిచేయుచున్న కంపెనీలో ప్రమాదం జరిగి కాలుకి ఫ్రాక్చర్ అయ్యింది. ఈ యాక్సిడెంటు ద్వారా దేవుడు నా జీవితమును ఒక మలుపు త్రిప్పారు. ఒక నెల రెస్ట్ తీసుకొని, తరువాత నెల నుండి వెల్డింగ్ వర్క్ నేర్చుకోవాలనే ఆసక్తితో మా బావమరిది దగ్గరకు వెళ్ళి నేర్చుకున్నాను. వర్క్ నేర్చుకున్న తరువాత ప్రశాంత్ నగర్‌లో జాబ్

జాయిన్ అయ్యాను. ఈ వర్కే కాకుండా వేరే వర్క్ కూడా నేర్చుకోవాలని ఉపవాస ప్రార్థనలో రిక్వెస్ట్ రాసి పెట్టాను. దేవుని దయ వలన ఆ వర్క్ కూడా నేర్చుకున్నాను. నాకు చాలా కోపం ఉండేది, దాని వలన కుటుంబములో సమస్యలు వచ్చినప్పుడు దైవసేవకులు చెప్పిన మాటల ద్వారా నన్ను నేను మార్చుకున్నాను. పరిచర్యలో సహోదరుల ప్రేమ నన్ను ఎంతగానో ఆదరించింది. దేవుడు బహుమానంగా నాకు ఇద్దరు బిడ్డలను అనుగ్రహించారు. అంతే కాక మాకు ఉన్న ఋణ బాధలన్నిటిని తీర్చి కుటుంబములో శాంతి, సమాధానమును నింపిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు. ఏ యోగ్యత, జ్ఞానము, మంచితనములేని నన్ను ప్రేమించి, రక్షించి మంచి దైవసేవకులను, పరిచర్యను అనుగ్రహించిన దేవునికి ఎన్ని కృతజ్ఞతాస్తుతులు చెల్లించిననూ ఋణస్తుడనే.

దేవుని పని కొరకు ఉపయోగపడే నమ్మకమైన పాత్రగా నన్ను ఆయన వాడుకోవాలని ప్రార్థించగలరు.

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 9666666249 | 040-24202227
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# ప్రార్థన - ఊపిరిపీల్చుట వంటిదే

నీవు తీరిక లేని తల్లివి, ఉపాధ్యాయురాలివి, సంఘకాపరివి, మెకానిక్‌వి ఎవరివైనా సరే నీవు నీ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడమే కాక, కుటుంబ బాధ్యతలు కూడా నిర్వర్తించవలసి ఉంటుంది. ఈ పనులన్నింటి మధ్యలో కొద్ది నిమిషములు విశ్రాంతి కూడా అవసరమై యుంటుంది. కాబట్టి ఈ పనుల మధ్య ఏ విధంగా ప్రార్థించగలగాలంటే ఒక్క క్షణం ఆగి "ఓ యేసూ! నిన్ను ప్రేమిస్తున్నాను, ఈ క్షణమే నన్ను బలపరచు దేవా, నాకు కొంత బలం సహనం అవసరమై యున్నది. నాకు కృప నివ్వు దేవా! అందరితో ప్రేమ కలిగి ప్రవర్తించునట్లుగా నాకు సహాయం చేయి అని దేవునితో మాట్లాడడానికి మనకి ఉన్న సమయమును ఉపయోగించుకోవాలి.

> **మనకి ఉన్న కొద్ది సమయములో దేవుని గౌరవించుట మొదలు పెట్టినప్పుడు దేవుడు దానిని అభివృద్ధి చేస్తాడు**

మనమందరము చిన్న చిన్న విషయ ములు ఆయనకు చెప్తూ, క్లుప్త విన్నపములు చేస్తూ, క్లుప్త కృతజ్ఞతలు చెల్లిస్తూ గడపాలని దేవుడు కోరుకుంటున్నాడని నేను నమ్ము తున్నాను. మన బిడ్డలు మనలను కలిసిన ప్రతిసారి "అమ్మా నేను నిన్ను ప్రేమిస్తున్నాను" లేక "నాన్న నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పినప్పుడు మనకి ఎంత ఆనందంగా ఉంటుందో ఆలోచించండి. వారికి తీరిక లేని సమయములలో కూడా ఒకసారి ఆగి "నువ్వు నిజంగా చాలా అద్భుతమైన దానవు ! మళ్ళీ కలుద్దాం" అని చెప్తే అంత కంటే మనకి ఇంకేం కావాలి. ఇతరుల గురించి వారు గొప్పవారు ప్రేమ కలిగిన వారు అని మనం మాట్లాడకునే సంభాషణ సంబంధములను పెంపొందిస్తుంది. అదే విధంగా మన ప్రభువుతో కూడా ఉన్నట్లైతే ఆయనతో మన సంబంధం మరింత లోతుగా వెళ్తుంది, బలంగా ఎదుగుతుంది. మరియు మనం ఆయనతో "ఎప్పుడైనా, ఎక్కడైనా" ప్రార్థన ద్వారా నిరంతరం కలసి ఉంటాము. దానిని ఆయన ప్రేమిస్తున్నాడు.

ఇతర పనులలో తీరిక లేకుండా ఉండగా ప్రార్థించడానికి రోజంతా కాకుండా ఆయన కొరకు మనము ఇష్టంగా సమయమును కేటాయించుకొని ఆయనను గౌరవించుట ఎంత ముఖ్యమో ఖాళీగా ఉన్నప్పుడు రోజంతా ప్రార్థించుట అనేది కూడా ముఖ్యమైనదే. ఏమీ చేయక పోవుట కంటే ఏదో ఒకటి మనము చేయుట మంచిది. కేటాయించిన సమయములో ప్రార్థించలేనందుకు అపరాధ భావనను పొందక, సాగిపోయి దినమంతా పనుల మధ్యలో ప్రార్థించుటలో గడుపుచూ మనకి ఉన్న సమస్యల గురించి ఆయనతో చెప్పడం

మొదలుపెట్టినట్లయితే జీవితమును ప్రశాంతంగా, జ్ఞానంగా గడుపుకొనుటకు దేవుడు మనకు శక్తిని, సమర్థతని ఇస్తాడు. మనం దేవునికే సమయమిస్తే ఆయన మన బలమును నూతనం చేసి, అలసిపోకుండా జీవించుటకు సమర్థుల్ని చేస్తారని (యెషయా 40:31) బైబిలు చెబుతుంది. అయితే మనకి ఉన్న సమయమును ఉపయోగించుకుంటూ మనం మొదలుపెట్టాలి.

ఆత్మ వలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థన, విజ్ఞాపన చేయుడి అని ఎఫెసీ 6:18 సూచిస్తుంది. ఆత్మలో ప్రార్థించుట అనగా మనకి ఇష్టం వచ్చినట్లు ప్రార్థించుటకు బదులుగా, ప్రార్థించుచుండగా పరిశుద్ధాత్ముని నడిపింపునకు ఒప్పుకొనుట. మనకు ప్రార్థించాలని అనిపించిన వాటిని గురించి కాకుండా, ఆయన వేటిని గురించి ప్రార్థించుటకు నడిపిస్తాడో, వాటిపై దృష్టిని కేంద్రీకరించుట.

అనేకసార్లు మనము మన సమస్యలు, అవసరతల గురించి మాత్రమే ఆలోచిస్తూ, వాటి గురించే ఎక్కువ సమయమును ప్రార్థిస్తూ ఉంటాము. ఉదా :- మన ఆరోగ్యం, మంచి స్థితి, ఆర్థిక అవసరతలు, ఎదుర్కొంటున్న సవాళ్ళు, కుటుంబాలు, ఇంకా మనకు సంబంధించిన ఇతర విషయములపై దృష్టిని పెడతాము. అయితే మనం మన అంతరంగ జీవితములను గురించి - మన ఆలోచనలు, ఉద్దేశ్యములు, దేవునితో మన సంబంధం గురించి ప్రార్థించినట్లైతే ఆయన మన బాహ్య జీవితం గురించి శ్రద్ధ తీసుకుంటారు. మన లోపలి జీవితమును కట్టుకోవడానికి మనం ప్రార్థిస్తే దేవుడు మన బాహ్య జీవితమును గురించి శ్రద్ధ తీసుకుంటారు. మనకు అవసరమైన వాటిని, కోరుకున్న వాటిని అడుగుటలో ఖచ్చితంగా తప్పులేదు, అయితే అవి ఎక్కువ భాగమును ఆక్రమించకూడదు. మనం అడుగక ముందే మనకు కావలసినవి ఆయనకు తెలుసని బైబిల్ చెప్పుచున్నది. కాబట్టి మనం చేయవలసినదంతా కేవలం ఆయన నడిగి మనం మన ప్రార్థనా సమయమును ఇతరుల అవసరతలు (శారీరక, ఆత్మీయ) ఆయన రాజ్యవ్యాప్తి, మరియు మన ఆత్మీయ అవసరతల గురించి మన ప్రార్థనా సమయంలో ఎక్కువ భాగమును గడుపుతుండగా మన అవసరతలను ఆయనే తీరుస్తాడన్న నమ్మకం మనం కలిగి ఉన్నామని దేవునికి తెలియనివ్వాలి.



# నదులు


## నైలు నది

లోకములోని ముఖ్యనదులలో మరియు ఐగుప్తు దేశపు నదులలో ఒకటి నైలు నది. నైలు అను పేరు గ్రీకు వారు దీనికి పెట్టినది. ఐగుప్తీయులు దానిని ఒక దేవతగా ఎంచి పూజ చేసేవారు. ఈ నది వలనే ఐగుప్తుకు భూసారము కలుగును. ఈ నది లేకపోయిన యెడల ఐగుప్తు కూడా దాని చుట్టూ ఉండు ఎడారులవలె ఉండియుండును. ఐగుప్తులో వర్షములు కురియుట చాలా తక్కువ. ఆఫ్రికా మధ్య భాగమున ఈ నది పుట్టినది. అచ్చట వర్షాకాలములో అనగా జూన్ నెల మొదలుకొని నవంబరు మాసము వరకు చాలా వర్షము కురియును. అందువలన ఆ నది ఉప్పొంగి వరదలై ఐగుప్తు దేశమందంతట వ్యాపించును. దీనిచే దేశమునకు తేమ మాత్రమే గాక భూసారము కూడా కలుగును. ఈ వరద ఏడు సంవత్సరముల వరకు రాకపోవుటచే యోసేపు కాలములో ఐగుప్తులో కరువు కలిగెను.

ఈ నదిని గూర్చి బైబిలులో అనేక సూచనలు కలవు గాని దానికి ఏరు లేక నది అను పేరు తప్ప సాధారణముగా వేరే పేరు లేదు. నైలు నది దేవుడు అబ్రాహాముతో నిబంధన చేసిన దేశము యొక్క దక్షిణపు సరిహద్దు.

ఈ నదిని ఫరో తన యొక్క కలలో చూచెను.

మోషే ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు దేశము నుండి విడిపించే సమయంలో ఫరో రాజు ఇశ్రాయేలు ప్రజలకు అనుమతి ఇవ్వనందున దేవుడు ఇచ్చిన కర్ర సహాయంతో మోషే ఈ నది నీటిని రక్తముగా మార్చెను.




# బైబిల్ క్విజ్ -20

(ఫిలిప్పీ - కొలస్సీ పత్రికలలో నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.

1. ప్రతి నామము కంటె పై నామమును దేవుడు ఎవరికి అనుగ్రహించాడు?
2. ఇచ్చే విషయంలో, పుచ్చుకొనే విషయంలో ఏ సంఘం పౌలుతో పాలివారైనారు?
3. మన ప్రతి అవసరము దేని చొప్పున, ఎవరి మహిమలో తీర్చును?
4. ఎపఫ్రా ఏ సంఘంలో నమ్మకమైన పరిచారకుడు?
5. పౌలు వ్రాసిన ఈ పత్రికను కొలస్సీయులు చదివిన తరువాత దాన్ని ఏ సంఘానికి అందించాలి?
6. బర్నబాకు సమీపబంధువు ఎవరు?
7. బ్రదుకు మూలముగానైననూ, చావు మూలముగానైననూ తన శరీరమందు క్రీస్తును ఘనపరచాలని ఎవరు అపేక్షిస్తున్నారు?
8. కొలస్సీ విశ్వాసులకోసం నిరంతరం ప్రార్థనలో పోరాడుతున్నది ఎవరు?
9. పౌలు హృదయంలో ఉన్న సంఘం ఏది?
10. మన పౌరస్థితి ఎక్కడ ఉంది?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జనవరి 31 తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మార్చి 2012 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :-** ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**<u>బైబిల్ క్విజ్ - 19 జవాబులు (ఎఫెసీ పత్రికనుండి ఇవ్వబడినవి) :</u>**

**1.** పరిశుద్ధాత్ముడు 1:14
**2.** క్రీస్తుయేసు 2:20
**3.** పౌలు 3:11
**4.** సత్యమనే దట్టి 6:14
**5.** పరిశుద్ధాత్మయందు 4:30
**6.** అపవాదికి 4:27
**7.** కోపం 4:26
**8.** సర్వాంగకవచం 6:13
**9.** జారత్వం, అపవిత్రత, లోభత్వం 5:3
**10.** సమయమును పోనీయక సద్వినియోగం చేసుకోవాలి 5:16

**<u>బైబిల్ క్విజ్ - 19 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

జి.కెవిన్, ఎమ్.విజయ, యస్.రిబ్కా, యస్.ఎస్తేరు, జి.మణికంఠ, కృప, జె.రాజ్యం, కొర్నేలి, దుర్గ, విజయకుమారి, సౌజన్య, స్వరూపరాణి

# ఎపఫ్రా మినిస్ట్రీస్

## 2012 ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు

| నెల | తేది | వారం | సమయం (ఉదయం) | స్థలం (మందిరం) |
|---|---|---|---|---|
| జనవరి | 26 | గురు | 9.00 | భాగ్యలత |
| ఫిబ్రవరి | 21 | మంగళ | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మార్చి | 23 | శుక్ర | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| ఏప్రియల్ | 06 | శుక్ర | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మే | 01 | మంగళ | 9.00 | భాగ్యలత |
| జూన్ | 03 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| జూలై | 01 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| ఆగష్టు | 15 | బుధ | 9.00 | భాగ్యలత |
| సెప్టెంబర్ | 19 | బుధ | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| అక్టోబర్ | 02 | మంగ | 9.00 | భాగ్యలత |
| నవంబర్ | 13 | మంగ | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| డిసెంబర్ | 02 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |

**యౌవనస్థుల కూడికలు:-**
ప్రతి నెల 2వ బుధవారం - భాగ్యలత
రాత్రి గం. 7.00 లకు

**స్త్రీల కూడికలు:-**
ప్రతి నెల 1వ బుధవారం - భాగ్యలత
ప్రతి నెల 2వ బుధవారం - చింతల్
రాత్రి గం. 7.00 లకు

**సేవకుల కూడిక:-** ప్రతి నెల 4వ బుధవారం - భాగ్యలత నందు రాత్రి గం. 7.00 లకు.

**“నీ దేవుడైన యెహోవా నీకు తోడైయున్నాడు,**
**నీకేమియు తక్కువకాదు”** ద్వితీ 2:7

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జనవరి – ఫిబ్రవరి

**భాగ్యలత** : చైత్రిక, హరికుమార్, సులోచనారాణి, రంగా, మణి, రమాదేవి, కుమారి, క్రాంతికృష్ణ, పాల్‌ప్రవీణ్, దీవెన, నిర్మల, తిరుమల, హైమావతి, రాజ్‌కుమార్, సజీవ్, కృపాలత, సత్య, రాజేష్, రగూయేలు, మంజుల, జోసెఫ్, పూజిత, తిమోతి, నిహారిక, తులసి, జ్యోత్స్న, కరుణాకర్‌రాజు, శ్రీనివాస్, సునీత, చల్లారావు, మనోహర్, దివ్య, రాజ్‌కుమార్, లత, స్నేహలత, ఆనందరావు, కొర్నేలి, మేరీసౌజన్య

**చింతల్** : కొర్నేలి, ప్రకాశ్, సజీవ్, శ్రావణి, సునీత, జయరాజు, రాహుల్, జ్యోతిర్మయి,పుష్పలత, జెర్రీరోజ్‌రాయ్, ఉదయ్, రిబ్కా, జె.యస్.ఎన్.మూర్తి, పవన్‌చందు, దానియేల్, హెప్సిబా, అమర్, సువర్ణరాజు,మహిమజ్యోతి, కీర్తన, స్పందన, నాగరాజు, దుర్గావెంకటలక్ష్మి, నాగవెంకటలక్ష్మి

**అనాజ్‌పూర్** : విజయమ్మ, వైకుంఠరావు, హనోకు, అంకమ్మ, సువమ్మ, సునీత, కీర్తి, మరియ, అమర్‌నాథ్, జాన్‌బీ

**ఇ.సి.ఐ.యల్** : జీవా, సజీవ్

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

ది. 25.12.2011 క్రిస్మస్ ఆరాధనలో పాటలు, సాక్ష్యము మరియు దేవుని వాక్యము ద్వారా వేలాది
మందికి దేవుని సువార్తను ప్రకటించడానికి అవకాశము కలిగించిన దేవునికే స్తోత్రములు.















జనవరి 1, 2012 ఆదివారం నూతన సంవత్సర ఆరాధనను
దేవుడు అద్భుతంగా జరిగించారు. దీనిని బట్టి దేవునికి వందనములు.





# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org